
రేపు నా పుట్టిన రోజు. రేపటికి నాకు మూడేళ్ళు నిండి నాలుగు వస్తుందంట. రేపు మమ్మీ–డాడీ వచ్చి నన్ను సిటీకి తీసుకెళ్తారంట. అమ్మమ్మ నాకోసం సున్నుండలూ, జంతికలూ, తయారుచేసి డబ్బాల్లో పెట్టి ఓ సంచిలో సర్దేసింది. నా బట్టలన్నీ శుభ్రంగా చాకలితో ఉతికించి ఇస్త్రీ కూడా చేయించి చిన్ని ట్రంకులో పెట్టింది.



# చిన్నారి స్వాగతం

నేను ఆడుకునే లక్కపిడతలూ, వంటసామానూ, తన బొట్టుపెట్టిలో పెట్టి ట్రంకులో పెట్టింది. నా రంగు రంగుల రిబ్బన్లూ, క్లిప్పులూ, చమ్కీ రబ్బరు బాండ్స్, పిన్నులూ, గాజులూ అన్నీ తన చందువా పెట్టిలో పెట్టి అవి కూడా ట్రంకులో పెట్టింది. అమ్మమ్మ నాకోసం ఇంకా ఏమిటేమిటో సర్దుతూనే ఉంది.

మమ్మీ–డాడీ అంటే నాకెంతో ఇష్టం. మమ్మీ నాకోసం రంగు రంగుల పెన్సిళ్ళూ, బొమ్మల పుస్తకాలూ, మంచి మంచి గౌనులూ తెస్తుంది. డాడీ అయితే టీ.వీలో చూపించే చాక్లెట్స్, జెమ్ పాకెట్స్ తెస్తారు.

డాడీ ఒళ్ళో కూర్చోబెట్టుకుని కబుర్లుచెప్తూ ఒక్కొక్క జెమ్ నా నోట్లో పెడుతుంటే నాకెంత బావుంటుందో చెప్పలేను. డాడీ మెడచుట్టూ చేతులేసి డాడీ బుగ్గలమీద ముద్దు పెట్టుకోటమంటే నాకు చాలా ఇష్టం.

డాడీతో పూర్తిగా కబుర్లు చెప్పకుండానే మమ్మీ నన్ను లాగేసుకుంటుంది. తన తెచ్చిన కొత్తగౌను తొడుగుతుంది. సరిపోయిందో లేదో చూసి, నేను వేసుకుంటే చాలా బావుందంటూ మెచ్చుకుంటుంది. తను తెచ్చిన మాచింగ్ క్లిప్స్ పెడుతుంది. మూడేళ్ళు లేవు కానీ మూరెడు జుట్టు అంటూ ముద్దు పెట్టు కుంటుంది.

ఆ మాటతో అమ్మమ్మ ఓ గంట లెక్చరిస్తుంది నా జడల గురించి. దానికి పూల జడంటే ప్రాణం. తీరా అక్కడికి తీసుకెళ్ళాక నావల్లకావడం లేదంటూ కత్తిరించెయ్యమాక అని వార్నింగిస్తుంది.

నాకు నా బారు జడంటే చాలా ఇష్టం. గంటకోసారి నా జడల్ని అద్దంలో చూసుకో బుద్దేస్తుంది.

శ్యామలత్త రోజూ నాకు రెండు జడలు వేసి పెద్ద పెద్ద పూలదండలు నా జడల్లో పెడుతుంది.

బంగారు బొమ్మలా ఉన్నావంటూ అమ్మమ్మ నాకు దిష్టి తీసిన ఉప్పు పొయిలో వేసి మెటికలు విరుస్తుంది.

అమ్మమ్మకు నేనంటే ఎంతో ఇష్టం. రేపు నేను వెళ్ళి పోతున్నానని, అందరికీ చెప్తూ, కళ్ళంట

నీళ్ళొస్తుంటే కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. అలా అమ్మమ్మకు కళ్ళలో నీళ్ళొస్తుంటే

నాకూ యేడుపొచ్చేస్తోంది.

రాత్రి అమ్మమ్మ పక్కలో పడుకున్నప్పుడు నీకు ఇష్టం లేకపోతే మమ్మీతో వెళ్ళను. ఇక్కడే వుంటాను అన్నాను.

"తప్పమ్మా! నువ్వు మమ్మీ– డాడీతో వెళ్ళాలి. అక్కడ కాన్వెంటులో చక్కగా

చదువుకోవాలి. మంచి పాపాయిలా ఎప్పుడూ మమ్మీ చెప్పిన మాట వింటూ ఫస్టు మార్కులే తెచ్చుకోవాలి" అని బుజ్జగిస్తుంటే, అలాగే నంటూ నిద్రపోయాను.

తెల్లారే మమ్మీ–డాడీ వచ్చారు. మమ్మీ పొట్ట చాలా ఎత్తుగా ఉంది. ఈసారి మమ్మీ నన్ను యెత్తుకోలేదు.

డాడీ నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తున్నారు. మమ్మీ అమ్మమ్మా ఏవో మాట్లాడుకుంటున్నారు.

"ఇన్నాళ్ళూ ఏదో సరదాగా చేశావు. ఇప్పుడా ఉద్యోగం చెయ్యకపోతే నీకేం లోటయ్యిందంట.

శుభ్రంగా అబ్బాయి తెచ్చిన దానితో పొదుపుగా ఇల్లు దిద్దుకుంటూ నీ బిడ్డల్ని నీకళ్ళెదురుగా ఉంచుకోక," అంటూ మమ్మీని కోప్పడుతోంది అమ్మమ్మ.

—శివ పార్వతి

"నాకిప్పుడు మూడు నెలలు 'లీవె లాగూ ఉండనే ఉంది. ఈలోపు చిన్నారిని హాస్టల్లో పెడితే బుజ్జాడె లాగూ నీ దగ్గరే ఉంటాడు కదా! అంతగా ఏమన్నా ఇబ్బందొస్తే అప్పుడు చూసుకుందాంలే" అంటూ పెరట్లోకెళ్ళింది మమ్మీ.

తెల్లారే మమ్మీ డాడీతో సిటీకి వచ్చేశాను.

మమ్మీ బొమ్మల పుస్తకాల్లోని పేర్లన్నీ నాకు నేర్పుతుంటే అవి నేర్చుకుని మమ్మీకి చెప్పడం నాకెంతో సరదాగా ఉండేది. మమ్మీ అడిగిన వాటి పేర్లు తప్పల్లేకుండా చెప్తే 'గుడ్ గాళ్' అంటూ ముద్దు పెట్టుకునేది. నాకప్పుడు చాలా సంతోషంగా ఉండేది.

"చెప్పింది చెప్పినట్టు చక్కగా గుర్తు పెట్టుకుంటోంది. మన చిన్నారి చాలా 'ఇంటెలిజంట్",

మమ్మీ మెచ్చుకుంటూ డాడీకి చెప్తుంటే, నా 'బంగారు తల్లి' అని డాడీ నన్ను ముద్దుపెట్టుకున్నప్పుడు నాకు చెప్పలేనంత ఆనందంగా ఉండేది. ఇంకా ఇంకా గబగబా వేర్చేసుకోవాలన్పించేది.

ఒకరోచు మమ్మీకి పొట్టలో నొప్పంటూ హడావిడిగా అమ్మమ్మను తీసుకొచ్చారు. అప్పటికే డాడీ మమ్మీని హాస్పటల్‌కి తీసుకెళ్ళారు.

"ఎలా ఉన్నావురా చిట్టితల్లీ!" అంటూ అమ్మమ్మ నన్ను దగ్గరకు తీసుకుని

ముద్దుపెట్టుకుంది. నాకు బుజ్జి తువ్వాయి గుర్తుకొచ్చింది.

"నీకో బుజ్జి తమ్ముడొస్తున్నాడమ్మా! అల్లరి చెయ్యకుండా జాగ్రత్తగా ఉండూ." అని చెప్పి హడావిడిగా హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది.

పదిరోజులు ఇల్లంతా గందరగోళంగా వుంది. పదకొండో రోజు బుజ్జి పాపాయిని తీసుకుని మమ్మీ-అమ్మమ్మా ఇంటికి వచ్చారు.

అమ్మమ్మ బుజ్జి పాపాయికి నలుగు పెట్టి, నీళ్ళు పోసేప్పుడూ, నిద్ర పుచ్చేప్పుడూ పక్కనే కూర్చుని చూడటం నాకెంతో సరదాగా ఉండేది. పాపం బుజ్జిపాపాయికి వళ్ళంతా నూనె పులిమి పిండితో నలిపేస్తుంటే ఎర్రగా కందిపోయేది. నాకేమో భయంగా అనిపించి అలా నలిపెయ్యొద్దంటే, అలా చేస్తేనే చిన్ని పాపాయిలు నీలాగా బొద్దుగా-ముద్దుగా పెరుగుతారు.

చిన్నప్పుడు నీకూ ఇలాగే లాలపోశాను అంటూ నాలుగు బక్కెట్ల నీళ్ళతో నెత్తిమీద దిమ్మరిస్తూ స్నానం చేపిస్తుంది.

అప్పడప్పుడూ యేడవటం తప్ప పాపాయి కేమీ చెపటం చేతకాదు. ఎప్పుడూ నిద్రపోతూనే ఉంటుంది.

అలా అలా పాపాయికి రెండు నెలలు నిండి మూడోనెల వచ్చేసింది. ఓరోజు మమ్మీ ఢాడీ నన్ను స్కూలుకి తీసుకెళ్ళారు. అక్కడ టీచర్ అడిగిన పేర్లన్నీ చక్కగా చెప్తే ఐస్‌క్రీమ్ కొనిస్తానన్నారు.

స్కూల్లో అన్నీ చక్కగా చెప్పాను టీచర్ 'వెరీ గుడ్' అన్నారు. తర్వాత' రోజునుండీ నన్ను పొద్దున్నే లేపి గబగబా తయారుచేసి స్కూల్లో దింపి, మమ్మీ-డాడీ ఆఫీసుకి వెళ్ళిపోయేవారు.

బుజ్జి పాపాయీ, అమ్మమ్మా ఇంటి దగ్గర ఉండేవాళ్ళు. నేను మధ్యాహ్నం రిక్షాలో ఇంటికి వచ్చేదాన్ని. అమ్మమ్మ అన్నం తినిపించి బుజ్జిపాపాయి పక్కలో చప్పుడు చెయ్యకుండా పడుకోమనేది.

బుజ్జిపాపాయి నిద్రలోనే నవ్వుతూ యేడుస్తూ భలే తమాషాగా మెహం పెట్టేది. పాపాయిని చూస్తూ నేను నిద్రపోయేదాన్ని-

'పొద్దున్నే మమ్మీ-డాడీతో పాటుగా స్కూలుకి వెళ్ళటం, మధ్యాహ్నం పాపాయిను చూస్తూ పడుకోవటం నాకు చాలా బావుండేది.'

"ఒకరోజు", తాతయ్యకు బాగోలేదంట నేనింక ఊరికి వెళ్తానమ్మా!" అంటూ మమ్మీకి చెప్పింది అమ్మమ్మ.

"రెండురోజుల్లో చిన్నారిని హాస్టల్లో వేస్తాను. బుజ్జిని తీసుకుని వెళ్దువుగాని." అంది మమ్మీ.

"ఇప్పుడు దాన్ని హాస్టల్లో వెయ్యడమెందుకే మీతో పాటు తీసుకెళ్ళి మధ్యాహ్నం అక్కడే పడుకోబెట్టమని, సాయంత్రం మీతోపాటు తెచ్చుకుంటే సరిపోతుంది కదా! ఆమాత్రం చూసుకోలేరా!" అంది అమ్మమ్మ.

"రోజూ పొద్దున్నే దాన్ని తయారు చెయ్యాలంటే కష్టం. ఒక్కోరోజు ఒక్కోలా టైము సరిపోదు." అంది మమ్మీ.

మమ్మీ నన్ను బజారుకి తీసుకెళ్ళి కొన్ని డ్రస్సులూ, పుస్తకాలూ కొంది. 'బ్యూటీపార్లర్' అంట. అక్కడకు తీసుకెళ్ళి నా జుట్టుని క్రాపులా కత్తిరించమంది.

అక్కడ నా జడలు కత్తిరించేస్తారంటే యేడుపొచ్చేసింది. వద్దని చెప్పాలంటే భయమేసింది. మమ్మీ 'బాడ్ గాళ్' అంటే నాకు బాధగా ఉంటుంది. అందుకే మాట్లాడకుండా ఎదురుగా ఉన్న అద్దంలో చూసుకుంటూ కూర్చున్నాను.

అక్కడున్న ఆంటీ నా జడలు విప్పి జుట్టు తడిచేసి ఛక్ ఛక్ మంటూ నా జుట్టు కత్తిరించేస్తోంది. నాకు అక్కడినుంచి లేచి అమ్మమ్మ దగ్గరికి పారిపోవాలన్పించింది. కింద పడిపోతున్న జుట్టుని చూస్తుంటే నాకు యేడుపొచ్చేస్తోంది.

నా కళ్ళలో నీళ్ళొస్తుంటే మమ్మీకి కోపమొస్తుందేమోనని కళ్ళు మూసుకుని కూర్చున్నాను. నాకు అమ్మమ్మా-బుజ్జిపాపాయీ గుర్తుకొచ్చారు. బుజ్జిపాపాయి జుట్టుకూడా నాజుట్టు లాగానే చాలా బావుంటుందంట.

ఇంటికి వచ్చాక "బంగారంలాంటి జుట్టు కత్తిరించటానికి నీకు మనసెలా వచ్చిందంటూ," మమ్మీని కోప్పడింది అమ్మమ్మ.

'ఇంతకు ముందు గంటకోసారి నామొహం అద్దంలో చూసుకునే నేను అద్దంలో చూసుకోవటం మానేశాను. నా చిన్ని జుట్టుని అద్దంలో చూసుకుంటే నాకు చాలా యేడుపొచ్చేస్తోంది.'

"మూడేళ్ళు ముచ్చటగా పెంచి ఒక్కసారిగా వాళ్ళనిలా చూడటం నావల్ల కాదే తల్లీ. ఆ పసిగుడ్డుని కూడా చూసుకునే హాస్టలేమైనా ఉంటే దాన్ని కూడా అక్కడే పడేయ్." అంటూ అమ్మమ్మ కోపంగా ఊరికి బయల్దేరింది.

నాకెందుకో బుజ్జిపాపాయి మీద చాలా జాలిగా అన్పించింది. పాపం దానికి యేడవటం తప్ప ఇంకేమీ తెలీదు. అమ్మమ్మ లేకపోతే పాపాయిని మాటిమాటికీ ఎవరు శుభ్రం చేస్తారు. పాపం పక్కలోనే వళ్ళంతా ఖరాబు చేసుకుని యేడుస్తుందేమో! పాపాయి ఎందుకేడుస్తుందో అమ్మమ్మకు మాత్రమే చక్కగా అర్థమవుతుంది. పాపాయి అమ్మమ్మ దగ్గరుంటేనే బావుంటుంది. అందుకే నేను మెల్లగా అమ్మమ్మ దగ్గరకెళ్ళాను.

"పాపాయిని వదిలి వెళ్ళిపోవద్దమ్మమ్మా!" అంటూ అమ్మమ్మను పట్టేసుకున్నాను. అమ్మమ్మకు పాపాయి అంటే చాలా ఇష్టం. అమ్మమ్మ మాట్లాడకుండా నన్ను తీసుకెళ్ళి స్నానం చేపించింది.

"తెల్లారే నన్ను హాస్టల్‌కి తీసుకెళ్ళటానికి అన్నీ సర్దేశారు. నాకైతే బుజ్జిపాపాయిని వదిలి వెళ్ళబుద్ది కావటం లేదు. ఎంచక్కా, మమ్మీ డాడీ మధ్యలో మమ్మీ పక్కన బుజ్జిపాపాయీ, డాడీ పక్కన నేనూ పడుకోవటం నాకెంత ఇష్టమో!"

హాస్టల్లో నాలాంటి పాపాయిలు చాలా మంది ఉంటారంట కానీ, మమ్మీ-డాడీ బుజ్జిపాపాయీ ఉండరు కదా!

అక్కడ ఆయాలే అమ్మమ్మలాగా మా పనులన్నీ చేస్తారంట. అయినా నాకు యేడుపొస్తోంది.

అమ్మమ్మకి కూడా యేడుపొచ్చినట్లుంది. అటు తిరిగి కళ్ళు తుడుచుకుని నా దగ్గర కొచ్చింది.

"బంగారు తల్లివి. బాగా చదువుకుని పెద్దయ్యాక పెద్ద డాక్టరమ్మవి కావాలి." అంటూ ముద్దు పెట్టుకుంది.

నిద్రలో పాపాయి నవ్వుతోంది. నేను బుజ్జి బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాను. బుజ్జి నిద్రలోనే యెందుకో బిక్కమెహం పెట్టింది.

నేను నా నోరు విప్పాలంటే యేడుపొచ్చేలా ఉంది. నేను యేడిస్తే అమ్మమ్మా యేడ్చేలా ఉంది. అందుకే అలాగే అన్నట్టు తలూపి ఆటో యెక్కేశాను.

"నేను పెద్దయ్యాక డాక్టరమ్మనయినా, కలక్టరమ్మనయినా నా బుజ్జి పాపల్ని మాత్రం హాస్టలుకి పంపనే పంపను." నేను మమ్మీనయితే ఎలా ఉండాలో మనసులో ముద్రించుకున్నాను.

మమ్మీ వచ్చి నా పక్కన కూర్చుంది. మసక మసకగా కన్పిస్తున్న అమ్మమ్మకు చెయ్యి ఊపాను. ఆటో మలుపు తిరిగింది. ■